క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 25 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు హరిచందన

కె.కోటపాడు: కంటి సంబంధిత సమస్యలకు త్వరితగతిన మెరుగైన వైద్యం పొందాలని శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి హరిచందన తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించేందుకు విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ లెక్కల అర్జున, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వినీకుమార్, వందన తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌కు హోంమంత్రి అభినందన



ప్రిన్సిపాల్ వెంకటరెడ్డిని అభినందిస్తున్న హోంమంత్రి అనిత

నర్సీపట్నం: ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేసిన ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డిని హోంమంత్రి వంగలపూడి అనిత సన్మానించారు. జిల్లాలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన 25 మంది ప్రిన్సిపాళ్లకు, హెచ్ఎంలకు విద్యా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లిలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో హోం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరెడ్డికి శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి అభినందించారు.

కూటమి విజయోత్సవ సభకు స్పందన కరువు

దేవరాపల్లి: కూటమి నేతలు ఆదివారం రాత్రి దేవరాపల్లిలో నిర్వహించిన విజయోత్సవ సభకు జన స్పందన కరువైంది. ఈ సమావేశానికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సభకు జనం రాకపోవడంతో కూటమి నేతలు నిశ్చేష్టులయ్యారు. అంతకు ముందు ఎంపీ, ఎమ్మెల్యేలతో సభా వేదిక వరకు సాగిన ర్యాలీకి స్పందన కరువైంది. ఈ సభలో పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులకు సత్కారాలు చేశారు. ఈక్రమంలోనే ఒక్కసారిగా పార్టీ నాయకులు తరలి రావడంతో వారిపై ఎమ్మెల్యే, ఎంపీ అసహనం వ్యక్తం చేసి వేదిక దిగి వెళ్లిపోయారు. మరలా పార్టీ నాయకులు కోరడంతో వేదిపైకి వచ్చి సత్కార కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆదివాసీల భూ సమస్యల పరిష్కారానికి కృషి

రోలుగుంట: మండలంలోని గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్. తెలిపారు. ఎం.కె.పట్నం శివారు ఛటర్జీపురం గ్రామ ఆదివాసీల భూ సమస్యలు తెలుసుకోవాడానికి ఆయన ఆదివారం ఆ గ్రామానికి వెళ్లారు. 139 సర్వే నంబర్‌లో పదెకరాల భూమిని అయిదు ఆదివాసీ కుటుంబాల వారు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ విషయమై స్థానికులను ఆయన అడిగి తెలుసుకున్నారు. రికార్డులో సాగుదారులుగా ఉన్నట్టు తెలుసుకున్నారు. మండల రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఆదివాసీల పేర్లను అధికారులు తొలగించినట్టు వాపోయారు. ఈ సమస్యపై రోలుగుంట పోలీసులు పదేపదే స్టేషన్‌కు పిలిపించి రాత్రి వరకూ ఉంచి సాగు నిలిపివేయాలని ఇబ్బంది పెట్టిన విషయాలను మొరపెట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బలిజి మహరాజు, శివాజీ, శివ, అప్పారావు, త్రినాథ్, జగ్గునాయుడు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జగన్నాథ స్వామి రథయాత్ర

- ఇంద్రద్యుమ్నం వద్ద కొలువైన స్వామివారు
- చోడవరం పురవీధుల్లో సంబరంగా సాగిన రథయాత్ర

భక్తుల జయజయ ధ్వానాల మధ్య మాడుగుల, చోడవరం పట్టణంలో జగన్నాథుని రథచక్రాలు కదిలాయి. భక్తుల నినాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా స్వామివారి రథయాత్ర సాగింది.



ఇంద్రద్యుమ్నం వద్ద కొలువైన జగన్నాథుడు

చోడవరం: జగన్నాథస్వామి తొలి రథయాత్ర అంగరంగ వైభవంగా ఆదివారం జరిగింది. చోడవరం కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఉపాలయంలో వేంచేసిన జగన్నాథ స్వామివారి రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి రథయాత్ర సందర్భంగా నూతనంగా తయారు చేయించిన రథంపై ప్రత్యేకంగా అలంకరించిన సుభద్ర, బలభద్రుడు సమేతుడైన జగన్నాథ స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య స్వామివారి రథయాత్ర శోభాయమానంగా సాగింది. రథయాత్రను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో స్వామివారి రథయాత్ర చోడవరం పట్టణ పురవీధుల్లో సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీధుల్లోకి వచ్చి జగన్నాథ స్వామి రథంపై కొబ్బరికాయలు కొట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఇక్కడ బోళ్లవీధి రామాలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి దశావతార దర్శనానికి ఏర్పాట్లు చేసిన ప్రదేశం వరకూ రథయాత్ర జరిగింది. రథయాత్రలో ఎటువంటి ఇబ్బందులు కలుగుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవంలో గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రలో భక్తులు

నేడు మత్స్యావతారంలో స్వామివారు దర్శనం

రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి రోజుకో అవతారంతో భక్తులకు దర్శనమిస్తారు. మొదటి రోజు సోమవారం మత్స్యావతారంలో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారు. ఇందుకోసం స్వామివారికి విశేష అలంకరణ చేసి ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనం భక్తులకు కల్పిస్తున్నామని అర్చకుడు సీతారామాచార్యులు తెలిపారు.

మాడుగుల: జగన్నాథ స్వామివారి రథయాత్ర ఉత్సవాలు ఆదివారం మాడుగులలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి స్వామివారి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారిని ప్రతిష్టించి రథయాత్ర ప్రారంభించారు. స్వామివారి రథం లాగడానికి అధిక సంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. స్థానిక గవరవీధిలో ఇంద్రద్యుమ్నం వద్దకు రథయాత్ర చేరుకుని అక్కడ స్వామివారు కొలువు దీరారు. అక్కడే దశావతారాలలో భక్తులకు దర్శనమిచ్చి తిరిగి ఆలయానికి చేరుకోవడంతో జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు పండా నూకరాజు తెలిపారు.



జగన్నాథస్వామి



చోడవరం: జగన్నాథస్వామి రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు



కొత్తగా తయారు చేసిన స్వామివారి రథంపై బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామివారు

అంధకారంలో బస్టాండు



చీకటిమయంగా మాకవరపాలెం బస్టాండు

మాకవరపాలెం: విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఆర్టీసీ బస్టాండు అంధకారంలో దర్శనమిస్తోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి నర్సీపట్నం, విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు నిత్యం అధిక సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తాయి. తెల్లవారు 5 నుంచి రాత్రి 10 గంటల వరకు మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు బస్టాండు నుంచే ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ఇక్కడ చాలా కాలంగా రాత్రి వేళల్లో లైట్లు వెలగడం లేదు. ఈ నేపథ్యంలో చీకటిలో ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రాత్రి వేళల్లో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు బైక్ ర్యాలీతో స్వాగతం

కె.కోటపాడు: అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా చౌడువాడకు విచ్చేసిన వీరికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం కె.కోటపాడు సమావేశంలో సీఎం రమేష్ మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి, యువతకు ఉపాధి కల్పన చేసే చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్, తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు రొంగలి మహేష్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో వేరుశనగ పంట ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ సాగులో భాగంగా వందెకరాల్లో సాగు చేస్తున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలు వేరుశనగ పంటకు మేలు చేశాయని సాగు రైతులు చెబుతున్నారు. వేరుశనగ విత్తు వేసిన నాటి నుంచి వర్షాలు పడుతుండడం పంటకు ప్రయోజనకరంగా ఉందని అంటున్నారు. కొరువాడ, పాతనవలస, వారాడ, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, గుల్లేపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో వందెకరాల్లో వేసిన పంట పూతదశకు చేరుకుంది. ఈ దశలో పంటకు ఎకరాకు 200 కేజీలు జిప్సం వేసినట్లయితే గింజలో నూనె శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు.



వారాడలో వేరుశనగ పంట

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

మాకవరపాలెం: ఉత్తమ సేవలు అందించే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. కోటవురట్ల మండలం రాజుపేటలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కాశీషా పదవీ విరమణ చేయడంతో మాకవరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘువర్మ పాల్గొని కాశీషా దంపతులను సత్కరించారు. ఏపీటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు



శిథిలావస్థలో నూకాలమ్మ తల్లి ఆలయం

రోలుగుంట: స్థానిక నూకాలమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నిర్మాణం కోసం ఇద్దరు దాతలు లక్ష రూపాయలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఇక్కడ ఆలయం నిర్మించి 80 ఏళ్ల పైగా కావడంతో జీర్ణావస్థకు చేరుకుంది. ఆలయ నిర్వహణ, అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలను మునిసబ్ కుటుంబీకులు చూసుకుంటున్నాయి. వీరితోపాటు స్థానికులు అల్లు శ్రీను, కొట్టి రమక్క, బణికల దేవుడు, బోయపాడు శ్రీను కమిటీగా ఏర్పడి ఆలయ పునర్నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు దాతల సాయం తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా స్వర్గీయ మడ్డు రామ్మూర్తి నాయుడు తమ్ముడు చిట్టిబాబు, కుమారుడు ప్రసాద్ రూ.50 వేల చొప్పున లక్ష రూపాయలు ఇస్తున్నట్టు ప్రకటించారు. వీరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభ ముహూర్తం మేరకు ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఈ నెల 19న బయటకు తీయడంతోపాటు ఇదే నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. భక్తులు సహాయ సహకారాలు అందించాలని కమిటీ వారు కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

చోడవరం: దివంగత వంగవీటి మోహన్‌రంగా జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రేమ సమాజంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పెద్ద సంఖ్యలో యువకులు వచ్చి రక్తదానం చేశారు. వందేమాతరం బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది ఈ శిబిరంలో రక్తాన్ని సేకరించారు. సుమారు 50 యూనిట్లు రక్తాన్ని యువకులు ఇచ్చారు. శిబిరాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి జగత శ్రీనువాసరావు సందర్శించి కాపుల కోసం వంగవీటి మోహన్‌రంగా చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆకుల రమేష్, పుల్లేటి సతీష్, యర్రంశెట్టి గోపి, కొసర తాతారావు, గంట్రెడ్డి శ్రీను, సిద్ధాబత్తుల నాని, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్ జయంతి నేడు



కంచుగుమల్లో వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేయిస్తున్న ఎంపీటీసీ సతీష్



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న శ్రీనివాసరావు

నాతవరం: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు తెలిపారు. ముందుగా నాతవరం ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తామన్నారు. తర్వాత పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు చీడికాడలో

చీడికాడ: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం చీడికాడలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. వైఎస్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలందరూ విధిగా హాజరు కావాలని కోరార

హాజరు కానున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఎం. అలమండలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తారన్నారు. అనంతరం కేక్ కట్ చేస్తారన్నారు.

మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రోలుగుంట: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతోత్సవానికి మండలంలో అన్ని గ్రామాల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా కంచుగుమలలో ఎంపీటీసీ సభ్యుడు వడ్డాది సతీష్ పర్యవేక్షణలో వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేయించి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాలను రోలుగుంటలో జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, కొవ్వూరులో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొమరవోలులో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు గొర్లె రామస్ వైఎస్సార్ విగ్రహాలను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల గుండెల్లో గూడు కట్టుకున్న వైఎస్సార్ జయంతి వేడుకలను అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించాలని కోరారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి

చోడవరం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహిస్తామని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జగత శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ హామీ నెరవేర్చాలి

- ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



శరభవరంలో ఎమ్మార్పీఎస్ సభ్యుల ప్రదర్శన

చీడికాడ: ఎస్సీ కుల వర్గీకరణపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలని మాదిగ ఉద్యోగులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొర్తా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చీడికాడలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వర్గీకరణ ఉద్యమం ద్వారా దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు మేలు జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎస్సీలో ఏబీసీడీ వర్గీకరణ మాట నిలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు రావాడ దేముడుబాబు, ఎంపీటీసీ రావాడ మణి తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రోలుగుంట: మహాజన సోషలిస్టు పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి మంజేటి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి ఘాటీలు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎస్సీల ఉమ్మడి ఏబీసీడీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ఎత్తుల అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి తమ్మున్రుడు కేక్ కట్ చేశారు. మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నూతన చట్టాలపై అవగాహన పెంపొందించాలి'

అనకాపల్లి: భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలు పూర్తి స్థాయిలో అమలుపరిచే ముందు ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. పోలీస్ వ్యవస్థలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారులతో పాటు, విద్యాలయాల్లో, వివిధ ప్రజా సంఘాల కార్యక్రమాల్లో నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్లే యువత నేరాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలని రాస్తారోకో

నర్సీపట్నం: సీబీఎం కాంపౌండ్ సమీపంలో ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద డ్రైనేజీ సదుపాయం లేక చుట్టు పక్కల వారంతా ఇబ్బంది పడుతున్నారని ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకురాళ్లు జి.గౌరీ, కె.వి.సూర్యప్రభ పేర్కొన్నారు. తక్షణం డ్రైనేజీ నిర్మించాలని లేదా కళాశాల హాస్టల్‌ను మూసివేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకుడు బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి పినారపాలెం కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కళాశాల వద్ద నినాదాలు చేశారు. డ్రైనేజీ నిర్మించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం చూపకపోవడం శోచనీయమన్నారు. ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. రోడ్లపై మురుగునీరు నిలిచిపోవటం వల్ల దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.




రాస్తారోకో నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు


14న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి: స్థానిక గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మండలంలోని బట్లపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భావితరాల మనుగడను, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మానవ జాతి మనుగడకు మొక్కలే ప్రధాన ఆధారమన్నారు.


నవోదయకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



భారతి



జ్ఞానేశ్వరి



షణ్ముఖ

బుచ్చెయ్యపేట: వడ్డాది పీఎంఎస్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు లెక్కల భారతి, కర్రి జ్ఞానేశ్వరి, కశిరెడ్డి షణ్ముఖ ఎంపిక కావడంతో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ రమణ, పాఠశాల సిబ్బంది ఆదివారం అభినందించారు.

పూర్వ విద్యార్థుల సందడి



వడ్డాదిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బుచ్చెయ్యపేట: వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఇక్కడ 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వీరంతా 25 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుత యోగక్షేమాలు తెలుసుకుని సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడటానికి అందరూ కలిసి తీర్మానించుకున్నారు.